సాక్షి
జనగామ

I

బుధవారం । 29 । నవంబర్ । 2023

సాక్షి
జనగామ
బుధవారం । 29 । నవంబర్ । 2023





అభివృద్ధి చూసి ఓటేయండి జంగ్ తెలంగాణ గెలిపించండి మీ వెన్నంటే ఉంటాం..



రాయపర్తి: సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు


పాలకుర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు


పాలకుర్తిలో రోడ్‌కు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు


రోడ్‌షోలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ద్విచక్ర వాహన ర్యాలీ
- ముగిసిన ఎన్నికల ప్రచారం

పాలకుర్తి: అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఓటెయ్యాలని ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సభలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి, వల్మిడి, బమ్మెర గ్రామాల్లో కవులు, రచయితలు పేరును నిలబెట్టుకునే విధంగా సుమారు రూ.100 కోట్లతో నూతన భవనాలు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. తాను 40 సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో ప్రతి రోజు ప్రజల పనుల కోసం పని చేస్తున్నానని, ప్రజలు ఈ విషయం గమనించి తిరిగి ఆశీర్వదించాలని కోరారు. పాలకుర్తి మండలంలో మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో 200 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, సర్పంచ్ యాకాంతరావు, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దయాకర్‌రావు సేవలు గుర్తు పెట్టుకోవాలి

నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావు చేసిన అభివృద్ధి పనులను గుర్తు పెట్టుకొని ఓటు వేసుకోవాలని మంత్రి సతీమణి ఉషాదేవి అన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

రాయపర్తి: కాంగ్రెస్ నాయకుల మాటలు విని మోసపోవద్దని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల సమావేశానికి 30వేల లోపే జనం వచ్చారని, మొన్న తొర్రూరులో కేసీఆర్ సభకు 1.16వేల మంది, పాలకుర్తి హరీశ్‌రావు రోడ్ షోకి 80వేల మందితో హాజరయ్యారన్నారు. వీరంతా అభిమానంతోనే వచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, వైస్‌ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, వనజారాణి, నర్మద, భూక్య క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సతీమణి ప్రచారం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని కోరుతూ మండలంలోని తిర్మలాయపల్లి తెట్టెకుంట తండాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు ప్రచారం నిర్వహించారు. అలాగే మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం మండలకేంద్రంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదు

పెద్దవంగర: రాష్ట్రంలో ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్, మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు చిన్నవంగర, గంట్లకుంట గ్రామాల్లో పాలకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్నవంగర ఎంపీటీసీ మెట్టు సౌజన్య నగేష్ ఇటీవల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరగా అతని అనుచరులు ఉషాదయాకర్‌రావు సమక్షంలో 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉషాదయాకర్‌రావు మాట్లాడారు. నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పాకనాటి సునీల్ రెడ్డి, సోమారెడ్డి, జలగం శేఖర్, విజయ్‌పాల్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దయాకర్‌రావుకు మద్దతు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన గోసంగి కులస్తులు బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్లపల్లి యాకయ్య ఆధ్వర్యంలో ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంగళవారం తమ మద్దతు తెలిపారు.

మరో అవకాశం కల్పించండి

తొర్రూరు: పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోమారు అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో భారీ రోడ్ షో నిర్వహించారు. దయాకర్‌రావుకు మద్దతుగా వేలాది మంది బీఆర్‌ఎస్ శ్రేణులు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీపీ చిన్న అంజయ్య, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


తొర్రూరులో రోడ్ షోకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు


తెట్టెకుంటతండాలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు

- అమెరికాకు పోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపిస్తే మీ వెన్నంటే ఉంటానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో పాలకుర్తి మండల కేంద్రంలో భారీ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిలో ప్రజా సేవ చేయడానికి వస్తే మంత్రి దయాకర్‌రావు ఒక ఆడపిల్ల అని చూడకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమన్నారు. తొర్రూరు మండలం గుర్తూరులో 70 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి పాలకుర్తి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామన్నారు. పాలకుర్తి నియోజకవర్గ వాసులు చేతిగుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని, మంత్రిని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు.

పాలకుర్తిలో జరిగేది కురుక్షేత్ర యుద్ధం

పాలకుర్తిలో జరిగేది ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధమని, ధర్మం అధర్మం నాయ్యం, అన్యాయం మధ్య జరుగుతున్న ఎన్నికలని టీపీసీసీ సభ్యురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆదరణ చూసి మంత్రి దయాకర్‌రావు పెట్టిన ఇబ్బందులను గుర్తుకు చేసుకొని ఝాన్సీరెడ్డి భాగోద్వేగానికి గురై కంటనీరు పెట్టారు. పాలకుర్తి ప్రజలు తమ కుటుంబంపై చూపించిన ప్రేమ అభిమానం గుర్తు చేశారు. పాలకుర్తి ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్విని రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, నాయకులు పాల్గొన్నారు. పాలకుర్తి మండలం ఈరవెన్ను సర్పంచ్ ముస్కు నిర్మల చంద్రబాబు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రాయపర్తి: నా కోడలు యశస్వినిరెడ్డిని గెలిపిస్తే మీ వెన్నంటే ఉంటామని, అమెరికాకు తిరిగి వెళ్లిపోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాయపల్లి, జేతురాంతండా గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తొర్రూరు, ఖమ్మం తదితర నగరాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశానని మీరు గెలిపిస్తే పాలకుర్తి అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈవీఎం మిషన్ రెండో నంబర్‌లో ఉన్న చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, జినుగు రత్నాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, మచ్చ కుమారస్వామి, ఎనగందుల మురళి, శ్రీనివాస్, గుగులోతు విజయ్, యాకూబ్ పాల్గొన్నారు.


తొర్రూరు: ర్యాలీలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి


రాయపర్తి: అభివాదం చేస్తున్న ఝాన్సీరెడ్డి

మార్పు కోసం గెలిపించండి

తొర్రూరు: పాలనలో మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని, పాలకుర్తిలో ఆడబిడ్డకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, బ్యాండు మేళాలతో కాంగ్రెస్ శ్రేణులు యశస్వినిరెడ్డికి మద్దతుగా హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన 15 ఏళ్లలో పాలకుర్తికి మంత్రి దయాకర్‌రావు చేసింది శూన్యమన్నారు. ఎమ్మెల్యేగా గెలవగానే పాలకుర్తి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, నాయకులు కాకిరాల హరిప్రసాద్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, బాపురెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'పాలకుర్తి' తీర్పు ఆదర్శం కావాలి

కొడకండ్ల: పాలకుర్తి ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అండగా ఉండి మీరిచ్చే తీర్పు రాష్ట్రానికే ఆదర్శం కావాలని పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం నర్సింగాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ రెండో వార్డు సభ్యుడు నూనెముంతల ఎల్లగౌడ్, వెంకట్రాములు ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ముప్పై ఏళ్లకు పైబడి నుంచి తన సొంత గడ్డపై మమకారంతో మా అత్తమామలు రాజేందర్‌రెడ్డిఝాన్సీరెడ్డి అనేక సామాజిక సేవ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. పాలకుర్తి ప్రజల అకాంక్షల మేరకు ప్రజలకు ప్రత్యక్ష సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థి దయాకర్‌రావు అనేక అడ్డంకులు సృష్టించినా నమ్ముకొన్న వారికి అండగా ఉండాలనే సంకల్పంతోనే వారసురాలిగా తనను బరిలోకి నిల్పిందని, పాలకుర్తిలో జరిగే ధర్మ సంగ్రామంలో ఆడబిడ్డకు ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి మార్క్ చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, వంశీకృష్ణ, పనస రాంధాస్‌గౌడ్, వీర్యానాయక్, యాకూబ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డను ఆశీర్వదించండి..

హన్మకొండ: గూండాలను ఓడించి ఆడబిడ్డను ఆశీర్వదించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి చౌరస్తా వరకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మాఫియా వర్సెస్ మహిళకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు మహిళా బిల్లు తీసుకువచ్చారన్నారు. ఈ క్రమంలోనే రావు పద్మకు వరంగల్ పశ్చిమ నుంచి అవకాశం కల్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే వరంగల్‌లో అభివృద్ధి జరిగిందన్నారు. రావు పద్మను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.

అధ్యక్షా అనేదెవరో?

వరంగల్ పశ్చిమలో బరిలో మూడు ప్రధాన పార్టీల అధ్యక్షుల పోటీ

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ హనుమకొండ జిల్లా అధిపతుల రసవత్తర పోరు
- విజయం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముగ్గురు అభ్యర్థులు
- ఎవరు గెలుపొందుతారోనని తీవ్ర ఉత్కంఠ


దాస్యం వినయ్‌భాస్కర్


నాయిని రాజేందర్ రెడ్డి


రావు పద్మ

హన్మకొండ : ప్రస్తుత తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఓ ప్రత్యేకత కలిగి ఉంది. ఇక్కడి నుంచి మూడు ప్రధాన పార్టీల అధ్యక్షులు పోటీ పడుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి ఆయా పార్టీల ప్రెసిండెట్లు తలపడుతుండగా పోటీ రసవత్తరంగా సాగుతోంది. దీంతో ఈ ముగ్గురిలో ఎవరు గెలుపొంది అసెంబ్లీలో అధ్యక్షా అంటారో అనే విషయంలో ఆయా పార్టీల నేతలతోపాటు ఓటర్లలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ నాలుగు పర్యాయాలు వరంగల్ పశ్చిమ నుంచి విజయం సాధించి, ఐదో విజయం కోసం ధీమాగా ముందుకు సాగుతున్నారు. ఇక.. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి తొలిసారి పార్టీ అభ్యర్థిత్వం దక్కించుకుని అసెంబ్లీలో అడుగిడడానికి ఉవ్విళ్లూరుతున్నారు. అదే విధంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి తొలిసారి పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురు విజయం కోసం ఎవరికి వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఐదో విజయం కోసం దాస్యం వినయ్ భాస్కర్..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ ఐదో విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. 2009 సాధారణ ఎన్నికల్లో, 2010 ఉప ఎన్నికల్లో, 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా ఉద్యమకారులకు అండగా నిలవడం, ఉద్యమకారుడిగా ప్రజల్లో గుర్తింపు ఉండడం, నిత్యం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల ముంగిటికి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వినయ్‌భాస్కర్‌కు కలిసొచ్చే అంశాలు. ప్రధానంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులతో పాటు నియోజకవర్గంలో వైద్య చికిత్స కోసం పెద్ద మొత్తంలో సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం అందించారు. కార్మికులకు సొంతగా ప్రీమియం చెల్లించి వారికి గుర్తింపు కార్డులు ఇప్పించి బీమా సౌకర్యం కల్పించారు. దీంతో పాటు ఈ నెల 28న నిర్వహించిన సభకు సీఎం కేసీఆర్ రావడంతో తన గెలుస్తాననే ధీమాలో ఉన్నారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 245 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లు మొత్తం 2,86,688 ఉన్నారు. ఇందులో మహిళలు 1,45,009 మంది, పురుషులు 1,41,666 మంది, ఇతరులు 13 ఉన్నారు.

మొదటి సారి శాసనసభకు నాయిని రాజేందర్ రెడ్డి పోటీ..

వరంగల్ పశ్చిమ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న నాయిని రాజేందర్ రెడ్డి మొదటిసారి శాసన సభ ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీ పరిస్థితి డోలాయమానంలో పడిన సమయంలో కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారు. ఉమ్మడి వరంగల్, జిల్లాల పునర్విభజన తర్వాత హనుమకొండ, వరంగల్ జిల్లాలో పార్టీని కాపాడి ఈసారి టికెట్ సాధించారు. 2014, 2018లో పార్టీ టికెట్ ఆశించారు. ఆ రెండు సార్లు రాకపోయినా పార్టీలోనే కొనసాగుతూ వచ్చారు. ఈ సారి అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించడంతో బరిలో దిగారు. నిత్యం ప్రజల మధ్య ఉండడంతో పాటు, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ, నాలుగు పర్యాయాలుగా వినయ్ భాస్కర్ ఎమ్మెల్యేగా ఉండి ఆయనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, వ్యతిరేకత నాయిని రాజేందర్‌రెడ్డికి అనుకూలించే అంశాలు. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, జార్ఖండ్ సీఎం బూపేష్ భఘేల్, సినీ నటి విజయ శాంతి చేసిన ప్రచారం తనకు విజయం చేకూరుస్తుందనే విశ్వాసంతో ఉన్నారు.

'పద్మ'ం వికసించేనా..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన రావు పద్మ.. వరంగల్ పశ్చిమ నుంచి తొలి సారి పోటీ చేస్తున్నారు. కాగా, రావు పద్మ.. 2014 ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నుంచి టికెట్ ఆశించి చివరకు వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసి ఓటమి పొందారు. వరంగల్ మహానగరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాల ద్వారా జరిగిన అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై ఉన్న అసంతృప్తి, కాజీపేటలో రైల్వే ఓవరాయిలింగ్ యూనిట్, వ్యాగన్ తయారీ పరిశ్రమ మంజూరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు అవకాశం, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడం, ప్రధాని మోదీకి ప్రజాదరణ ఉండడం, డబుల్ ఇంజన్‌సర్కార్‌తో అభివృద్ధి, మహిళల ఓట్లు వంటివి రావు పద్మకు కలిసొచ్చే అంశాలు. రాష్ట్రంలో జనసేనతో పొత్తు, పవన్ కల్యాణ్ రాక, బీజేపీ నుంచి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి, ఇతర అగ్ర నాయకుల ప్రచారం చేయడం వల్ల రావు పద్మ తాను గెలుస్తాననే నమ్మకంతో ఉన్నారు.

ఒకే వ్యక్తి.. మూడు ఓట్లు

ఖిలా వరంగల్/ వరంగల్ అర్బన్: ఒకే ఇంటి నంబర్.. ఒకే వ్యక్తికి మూడు ఓట్లు ఉన్నాయి. ఈ విషయం వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ఓటరు జాబితాలో వెలుగు చూసింది. ఒకే పేరుతో మూడు ఓట్లు ఉండడం వల్ల క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారం ఎక్కువగా ఉందని, ఇది ఖచ్చితంగా రాజకీయ నాయకులే నమోదు చేసి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు. అధికారుల పరిశీలన, తప్పిదంతోనే ఒకే పేరుతో రెండు, మూడు ఓట్లు వెలుగు చూస్తున్నాయి. వరంగల్ కరీమాబాద్ ఏరియా సాంబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్ 17–8–48 ఐఓఎఫ్ 1778174 పురుషుడు వయసు 71, మరో ఓటు శాంబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్ 17–3–48 ఐఓఎఫ్ 2441251 పురుషుడు వయసు 65, మూడో ఓటు సమబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్ 17–3–48 ఐఓఎఫ్ 1914332 పురుషుడు వయసు 90తో ఓటరు లిస్టులో ఒకే పేరుతో మూడు ఓట్లు వెలుగు చూశాయి. అధికారులు దొంగ ఓట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని మేధావులు, ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వరంగల్ తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా విచారణకు ఆదేశించారు.


సాంబయ్య పేరిట ప్రచురితమైన ఓటరు జాబితా

రూ.8 లక్షల విలువైన మద్యం పట్టివేత

రాయపర్తి: మండలంలోని కిష్టాపురం క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ. 8 లక్షల విలువైన మద్యం పట్టుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ డీసీఎంలో ఈ మద్యం లభించిందన్నారు. ఈ సరుకు తొర్రూరులోని ఓ వైన్ షాపునకు చెందిందని తెలిపారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



సాక్షి జనగామ

V

బుధవారం | 29 | నవంబర్ | 2023

పోలింగ్‌కు సర్వం సిద్ధం - VI లో

విద్య, వైద్యం, పారిశ్రామికం

అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

- అభివృద్ధి మొదలైంది.. ఇక ఆగదు
- కాంగ్రెస్‌తో కుంటుపడ్డ వరంగల్ అభివృద్ధి
- మున్ముందు నగరానికి ఉజ్వల భవిష్యత్తు
- పెద్ద ఎత్తున రానున్న ఐటీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు
- ఇక్కడి ప్రజల బలంతోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించా
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

‘వరంగల్‌లో అభివృద్ధి మొదలైంది.. ఇక ఆగదు. ఇక్కడి ప్రజలు ఉద్యమ సమయంలో నాకు ఎంతో బలాన్ని ఇచ్చారు. ఈ బలంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించా. మరోసారి అదే బలాన్ని ఇవ్వాలి. రానున్న రోజుల్లో మరిన్ని ఐటీ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యుత్ సంస్థలు రానున్నాయి’.

- వరంగల్ సభలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్

- వివరాలు VI లో▸

ముగిసిన ప్రచారం





ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు

- ఓటు కోసం ట్రిక్కులు
- మత్తెక్కుతున్న పల్లెలు
- నగదు పంపిణీ షురూ
- వ్యూహాలకు పదును పెడుతున్న అభ్యర్థులు
- ఈసీ కంటబడకుండా జాగ్రత్తలు
- తూతూ మంత్రంగా తనిఖీలు...?

- VI లో▸

అభివృద్ధికి పట్టం గట్టండి

అభివృద్ధికి పట్టం కట్టాలని పాలకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం, ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.



దేవరుప్పుల: ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్‌గుప్తా

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల విధుల్లో సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా, బాధ్యతగా పనిచేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్‌గుప్తా అన్నారు. ఎన్నికల విధులు పడిన సెక్టోరియల్ అధికారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల విధుల నిర్వహణ, పోలింగ్ సామగ్రి పోలింగ్‌కేంద్రాలకు తరలించుట, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల సామగ్రితో రిసెప్షన్ కేంద్రానికి తీసుకురావడంలో పాటించాల్సిన జాగ్రత్తలు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ వాసం రామ్మూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పాలకుర్తి టౌన్: ఈనెల 30న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాలకుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రోహిత్ సింగ్ తెలిపారు. మంగళవారం విలేకరుతో మాట్లాడతూ పాలకుర్తి నియోజకవర్గంలో 294 బూత్‌లు, 352 పోలింగ్ టీంలు, 1,408 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 352 మంది పీఓలు, 352 మంది ఏపీఓలు, 704 మంది ఓపీఓ లను కేటాయించామని, 36 రూట్‌లో 36 మంది సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు.

మద్యం విక్రయాలు జరిగితే చర్యలు

- జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ



జనగామ రూరల్: జిల్లాలో అక్రమంగా మద్యం విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ అన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలోకి వస్తుందని 30వ తేదీ వరకు మద్యం షాపులు బంద్ ఉంటాయన్నారు. బార్ షాపులు, వైన్స్‌లు ఎవరైనా తెరిచి అమ్మకాలు జరిపితే తెలియజేయాలన్నారు. అలాగే బహిరంగ మద్యపానం సేవించకూడదన్నారు. అక్రమ మద్యం నిల్వలు ఉంటే కంట్రోల్ నంబర్ 9014017705, రాష్ట్ర టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2523కు కాల్ చేయాలన్నారు.

బైండోవర్ అతిక్రమించిన వ్యక్తికి జరిమానా

రఘునాథపల్లి: మండలంలోని లక్ష్మితండా గ్రామానికి చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు బానోతు సుధాకర్ బైండోవర్ అతిక్రమించడంతో తహసీల్దార్ పురం యుగేందర్ రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న సుధాకర్‌ను తహసీల్దార్ ఎదుట ఏడాదిపాటు బెల్ట్ షాపు నిర్వహించవద్దని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ నెల 26న సుధాకర్ బెల్ట్ షాపు నిర్వహిస్తూ రూ. 32 వేల మద్యంతో పట్టుబడటంతో సుధాకర్‌ను తిరిగి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గత బైండోవర్ ఉల్లంఘన మేరకు తహసీల్దార్ యుగేందర్ రూ.లక్ష జరిమానా విధించగా చెల్లించినట్లు ఎస్సై తెలిపారు.

విద్య, వైద్యం, పారిశ్రామికం



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి సత్యవతి రాథోడ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సారయ్య, ఎంపీ దయాకర్, పొన్నాల

అభివృద్ధి మొదలైంది.. ఇక ఆగదు

- కాంగ్రెస్‌తో కుంటుపడిన వరంగల్ అభివృద్ధి
- మున్ముందు నగరానికి ఉజ్వల భవిష్యత్
- పెద్ద ఎత్తున రానున్న ఐటీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు
- ఇక్కడి ప్రజల బలంతోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించా
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు నరేందర్, వినయ్‌భాస్కర్



సభా వేదికపై నృత్యం చేస్తున్న మహిళా కార్పొరేటర్లు

హన్మకొండ: ఓరుగల్లులో విద్య, వైద్యం, ఐటీ, పారిశ్రామికీకరణ మొదలైందని, ఇక ఆగదని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో వరంగల్ ప్రజలు తనకు బలాన్నిచ్చారని, ఈ బలంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపించానన్నారు. మరోసారి తనకు అదే బలాన్ని ఇవ్వాలని కోరారు. మంగళవారం వరంగల్ నగరంలోని కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ, తూర్పు అభ్యర్థులు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌ను గెలిపించాలని కోరుతూ.. నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో వరంగల్ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అజంజాహి మిల్లును మూసేయడంతో ఆస్తులాన్ని అమ్మిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. తాను వరంగల్ ప్రజలకు ఆ స్థాయికి తగ్గ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేశానన్నారు. దీంతో లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇప్పటికే కొన్ని ఐటీ కంపెనీలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఐటీ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యుత్ సంస్థలు రానున్నాయన్నారు. వరంగల్‌లో పెద్దఎత్తున పాడి పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు చెప్పానన్నారు. నగరంలో దుమ్ముధూళి పోయి బ్రహ్మాండమైన రోడ్లు వచ్చాయన్నారు. కాళోజీ పేరిట వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశానన్నారు. దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్ వరంగల్ ప్రజలు పెంచి పోషించిన బీసీ బిడ్డలని, ప్రజలంతా ఏకమై ఇద్దరిని గెలిపించాలన్నారు. చీఫ్ విప్ అయిన వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లో ఉండాల్సి ఉండగా.. వచ్చి హనుమకొండలోనే, ప్రజల మధ్య ఉంటున్నాడన్నారు. 'ఆటోలపై దాస్యం మా ధైర్యం' అని రాసుకోవడాన్ని తాను చూశానన్నారు. ఎంత ప్రేమ, ప్రజలకు అండగా ఉంటేనే ఇలా రాసుకుంటారన్నారు.

నిరంతర అభివృద్ధి

వరంగల్ అభివృద్ధి మొదలైందని, ఇక ఆగదని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు వచ్చేదని, ఇప్పుడు ప్రతి రోజూ వస్తుందన్నారు. కాజీపేట నుంచి వరంగల్ వరకు రైల్వే లైన్ చాలాదూరం ఉందని, ఈ రైల్వేలైన్‌పై 6 ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు అవసరమని, మళ్లీ అధికారంలోకి రాగానే నిర్మిస్తామన్నారు. 20 అంతస్తులతో అతి పెద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందని, హైదరాబాద్‌లో కూడా ఇంత పెద్ద ఆస్పత్రి లేదని, హైదరాబాద్‌కు వచ్చే రోగులు కూడా ఇక్కడికే రావాల్సి ఉంటుందన్నారు. 14 రకాల రోగాలకు చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. తూర్పు తెలంగాణ ప్రజలందరికీ వైద్యసేవలు అందుతాయన్నారు. సభలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, నాయకులు బొల్లం సంపత్‌కుమార్, మౌలానా జాహీద్, నాగుర్ల వెంకటేశ్వర్లు, దోనెపూడి రమేశ్ బాబు, రిజ్వానా షమీమ్, మర్రి యాదవరెడ్డి, ఎల్లావుల లలితా యాదవ్, జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలే నా బలం, బలగం: వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్



హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి జరుగుతోందని వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తనను నియోజకవర్గ ప్రజలు వారిలో ఒకరిగా చూసుకున్నారని, నా బలం, బలగం ప్రజలేనన్నారు. సీఎం కేసీఆర్ సహాయంతో గుడిసెవాసులకు పట్టాలిప్పించానన్నారు. ఇంకా కొంతమంది ఉన్నారని, వారికి కూడా ఇప్పించాలని సీఎంను కోరారు. పేద, మధ్య తరగతి వారికి ఇళ్లు కావాలని కోరారు. సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ము చేయలేదన్నారు. ప్రజలకు సేవకుడిగా పని చేశానన్నారు. మళ్లీ గెలిపించాలని కోరారు.

లారీడ్రైవర్ కుమారుడిని ఈ స్థాయికి తీసుకొచ్చారు : వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్



లారీ డ్రైవర్ కుమారుడినైన తనను ఎమ్మెల్యే స్థాయికి.. సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. మైనార్టీలకు అవకాశాలు కల్పించాలన్నారు. విద్య, వైద్యంలో వరంగల్‌ను ఉత్తర తెలంగాణకు తలమానికంగా సీఎం కేసీఆర్ నిలిపారన్నారు. తనను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సభ సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 1.10 గంటలకు సీఎం కేసీఆర్ సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 1.25 గంటలకు ప్రసంగం ప్రారంభం
- 1.52 గంటలకు ప్రసంగం ముగింపు
- 26 నిమిషాలపాటు ప్రసంగం కొనసాగింది.
- తెలంగాణ ఉద్యమ సమయంలో మానుకోటలో జరిగిన ఘటనను గుర్తు చేసుకుని వీరికి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.
- వరంగల్‌కు వన్నె తీసుకొచ్చేలా మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని అమలు చేశామని తెలిపారు.
- తెలంగాణ ఏర్పాటు కావాలని భద్రకాళి అమ్మవారికి మొక్కుకున్నానని, రాష్ట్రం ఆవిర్భవించగానే మొక్కు తీర్చుకున్నానని తెలిపారు.
- వరంగల్ సభ 95వది అని పేర్కొన్నారు.
- నన్నపునేని నరేందర్ వేదికపై నుంచి సభికులకు సాష్టాంగ నమస్కారం చేశారు.
- వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలనుంచి భారీగా జనం తరలివచ్చారు.

విద్య ద్వారానే వ్యవస్థ నిర్మాణం



నివాళులర్పిస్తున్న వీసీ రమేష్, తదితరులు

కేయూ క్యాంపస్: విద్య ద్వారానే వ్యవస్థ నిర్మాణమవుతుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. మంగళవారం కేయూలో బీసీ సెల్ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహనీయుల సంస్కరణల ద్వారా వచ్చిన మార్పులు ఆచరణలో అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. కేయూ రిటైర్డ్ ఆచార్యులు కె మురళీమనోహర్ మాట్లాడుతూ దేశంలో ఇంకా నిరక్షరాస్యత ఉందన్నారు. సామాజిక సంస్కరణలు ఇంటివద్దనుంచే ప్రారంభం కావాలన్నారు.అందుకు జ్యోతిరావుపూలేనే ఆదర్శమన్నారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు , కేయూ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ శ్రీనివాస్ మాట్లాడారు. తొలుత కేయూ దూరవిద్యకేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే,సావిత్రిబాయిపూలే దంపతుల విగ్రహాలకు వీసీ రమేష్, ఇతర ఆచార్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ వి రాంచంద్రం, ఆచార్య రాంనాథ్ కిషన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, కృష్ణమాచార్య పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాటలు నమ్మరు



మాట్లాడుతున్న పొన్నాల

జనగామ: రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని బాగు చేస్తామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు అనగానే దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు ప్రజలను మభ్య పెట్టానికే తెలంగాణలో పర్యటనలు చేస్తున్నారన్నారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో కంటే తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు 1.60 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, మరో 42 వేల ఉద్యోగాలు ఇవ్వబోతుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రజలను మభ్య పెట్టడానికేనన్నారు. పోరాటం, ఒత్తిడి వల్లే తెలంగాణ వచ్చిందని, సోనియా గాంధీ ఇవ్వలేదన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

నేటి నుంచి 4 వరకు 144 సెక్షన్ అమలు

- తనిఖీల్లో రూ.12.33 కోట్లు స్వాధీనం
- ఎన్నికల విధులకు 5,700 మంది పోలీసులు
- సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి ఎనిమిది శాసనసభ స్థానాలతో పాటు, పొరుగు జిల్లాలకు చెందిన కమిషనరేట్‌లో పాక్షికంగా ఉన్న హుస్నాబాద్, హుజురాబాద్, భూపాలపల్లి నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధి వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్, వర్ధన్నపేట, పరకాల, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో మొత్తం 1,128 పోలింగ్‌స్టేషన్లలో 2,126 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయని, ఈ ఎన్నికల నిర్వహణకు డీసీపీ స్థాయి నుంచి హోంగార్డు వరకు మొత్తం 4వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 1,700 మందికిపైగా కేంద్ర సాయుధ పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వెలువడ్డ నాటి నుంచి ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం రూ.12.33 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు రూ. 55 లక్షల విలువైన మద్యం, గుడుంబా, రూ.10 లక్షల విలువైన ఐదు వందల కిలోల నల్లబెల్లం, పటిక, రూ 1.64 కోట్ల విలువైన 667 కిలోల గంజాయి, ఆరున్నర కిలోల బంగారాన్ని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 842 కేసులు నమోదు చేసినట్లు సీపీ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇప్పటి వరకు 7,842 మందిని ముందస్తుగా అరెస్టు చేయగా.. ఇందులో 579 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు తెలిపారు.

ఆంక్షలు అమలు

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ విభాగం పలు ఆంక్షలు విధించినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ప్రజలు పాటించాలని మంగళవారం సాయంత్రం నుంచి డిసెంబర్ 4 వరకు కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈసమయంలో ఐదుగురికంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండడం నిషేధించినట్లు తెలిపారు. ఇతర నియోజకవర్గం నుంచి ప్రచారానికి వచ్చిన వారు స్థానికంగా ఎవరూ ఉండవద్దని, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు, రాజకీయ పార్టీల నేతలు 28న సాయంత్రం 5గంటల్లోపు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, ఇతర కారణాలతో ఇక్కడ లాడ్జీల్లో నివాసం ఉండే వారు సరైన కారణాలు, ఆధారాలు చూపాలని ఆయన సూచించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, బిఎస్ఎఫ్ కామాండెంట్‌లు హెచ్ఎస్ సాయిని, ముకేశ్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

బరాబర్ విద్యాసంస్థలను తీసుకొస్తా..

- జనగామ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- పల్లన్న కోసం ఆఖరి సిక్స్ కొట్టడానికి వచ్చా: బిత్తిరి సత్తి

జనగామ: జనగామను సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల తరహాలో అభివృద్ధి చేస్తా.. నర్సింగ్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, పారామెడికల్, తదితర విద్యా సంస్థలను బరాబర్ తీసుకొస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి నెహ్రూ పార్కు మీదుగా ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ రోడ్‌షో నిర్వహించారు. ప్రముఖ హాస్యనటుడు బిత్తిరి సత్తితో కలిసి పల్లా రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ అనేక అబద్దాలతో గ్లోబల్ ప్రచారం చేస్తుందన్నారు. వారి అబద్ధపు మాటలు నమ్మితే గోస పడక తప్పదన్నారు. జనగామ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న జనగామ నియోజకవర్గ ప్రజలందరికీ హైదరాబాద్ నీలిమా హాస్పిటల్‌లో పైసా ఖర్చు లేకుండా ఉచిత వైద్యం అందిస్తామన్నారు. 30న జరిగే పోలింగ్‌లో కారుగుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్ ను ఆశీర్వాదించి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.



జనగామ రోడ్‌షోలో మాట్లాడుతున్న బిత్తిరి సత్తి

పల్లన్నను గెలిపించాలి:బిత్తిరి సత్తి

పల్లన్న విజయమే సంకల్పంగా ఆఖరి సిక్స్ కొట్టేందుకు జనగామకు వచ్చానని, కొమురవెల్లిలో మల్లన్న, జనగామలో పల్లాన్న ఫేమస్, మీ అందరిని కడుపులో పెట్టుకొని చూసేందుకు వచ్చాడు. ఆదరించి గెలిపిస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని హాస్య నడుటు బిత్తిరి సత్తి అన్నారు. తెలంగాణ గడ్డకు కేసీఆర్ పేరు తెస్తే, జనగామకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకోనున్నారన్నారు. డబ్బింగ్గులు చేయడం తప్పా కాంగ్రెస్ వాళ్లకు ఏదీ చేతకాదన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, తాళ్ల సురేష్‌రెడ్డి, ఆకుల సతీష్, ధర్మసంతోష్‌రెడ్డి, పోకల లింగయ్య, మసిఉర్ రెహమాన్, మల్లవరపు అరవింద్‌రెడ్డి, బిజ్జాల నవీన్, జైనరమేష్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఈ ఎన్నికలే లాస్ట్..

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దెంకి దయాకర్
- తెలంగాణలో కాంగ్రెస్‌కు 91 సీట్లు ఖాయం
- జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి

జనగామ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల పాలన చేసి, ప్రజలను నిండా ముంచిన కేసీఆర్‌కు ఈ ఎన్నికలు లాస్ట్ కానున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం ఎన్నికల చివరి రోజు పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ రోడ్‌షో నిర్వహించారు. ఆర్టీసీ చౌరస్తాలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను నమ్మి ఓటు వేస్తే ఎవరికైనా డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారా అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, ఇంటి స్థలం ఎక్కడ ఉన్నా రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మహిళలకు రూ.2500, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 2 లక్షల ఉద్యోగాలు, ఒకే విడతలో రూ.2లక్షల రుణమాఫీ, తదితర సంక్షేమ పథకాలన్నీ పేదల ఇంటికి చేరుతాయన్నారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే మన బ్రతుకులు ఆగమవుతాయన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంపాదించుకోవడం కోసమే ఇక్కడకు వచ్చాడన్నారు. ఉద్యమ కారుడు కొమ్మూరిని గెలిపించి, కేసీఆర్ పక్కనే ఉంటానని చెప్పుకునే పల్లాను ఇంటికి పంపించాలన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కాంగ్రెస్‌కు 91 సీట్లు ఖాయం: కొమ్మూరి

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 91 సీట్లతో అధికారంలోకి రాబోతున్నామని జనగామ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిపిస్తే, నీతి, నిజాయితీతో పని చేస్తామని, వ్యాపారులు స్వేచ్ఛగా తమ పని చేసుకోవచ్చన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చే డబ్బులు తీసుకుని, చేతి గుర్తుకు ఓటు వేయాలన్నారు. గడిచిన పదేళ్లలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన స్వప్రయోజనాలు తప్ప, ఈ ప్రాంతానికి చేసింది శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, కంచ రాములు, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, బనుక శివరాజ్ యాదవ్, ఉడుత రవీందర్ యాదవ్, వంగాల కళ్యాణిమల్లారెడ్డి, మేడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ప్రచారం

- ఓటు కోసం ట్రిక్కులు
- మత్తెక్కుతున్న పల్లెలు
- నగదు పంపిణీ షురూ
- వ్యూహాలకు పదును పెడుతున్న అభ్యర్థులు
- ఈసీ కంటబడకుండా జాగ్రత్తలు
- తూతూ మంత్రంగా తనిఖీలు...?



జనగామ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం ముగిసింది. ఓటింగ్‌కు 48 గంటల ముందు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు రాజకీయ పార్టీల ప్రచార మైకులు మూగబోయాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ఆయా పార్టీలతో పాటు స్వతంత్రులు యాభై రోజులు ఊరూవాడా ప్రచారంతో హోరెత్తించారు. పార్టీల మేనిఫెస్టోలతో పాటు ఆకట్టుకునే సాంగ్స్‌తో ప్రజలను ఆకర్శించే విధంగా ధూంధాంతో హడలెత్తించారు. ప్రచారం ముగిసిపోవడంతో గత రాత్రి నుంచి ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఓట్ల కోసం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఎన్నికల అధికారుల నిఘాకు చిక్కకుండా, జాగ్రత్తలు పడుతున్నారు. కానీ ఈసీ అధికారుల తనిఖీలు తూతూ మంత్రంగా ఉన్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఎన్నికల సమయంలో మద్యం పంపిణీపై నిఘా ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నా.. మరోవైపు మద్యం ఏరులై పారుతోంది.

గప్‌చుప్‌గా.. గెలుపే లక్ష్యంగా..

అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన, ప్రతిపక్ష పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. గెలుపు కోసం చివరి రోజు రెండు రోజులు ప్రచారంలో దూకుడు పెంచారు. ఊరు, వాడ పట్టణ ప్రాంతాల్లోని ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నారు. విజయం సాధించే బూతులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఓటరు నాడిని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఓటుకు నోటు షురూ...!

ఓటుకు నోటు, ఈ పదం ప్రతి ఎలక్షన్లలో వినిపించే మాట. ఓట్లు వేసే వరకు నీకెంత, నాకెంత అంటూ గుసగుసలాడుకునే నోటు పదం, రెండు రోజుల నుంచి జిల్లాలో ఓటర్లకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఎన్నికల సంఘం అనేక మార్గాల ద్వారా నిఘా ఉన్నా.. ఇక్కడ మాత్రం అవేమీ పనిచేయడం లేదనే విమర్శలు లేకపోలేదు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో ఆయా రాజకీయ పార్టీలు ఒక్కో ఓటుకు రూ.1,000 నుంచి రూ.2, రూ.3, రూ.5వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం. బూత్‌కు 100 ఓట్ల చొప్పున విభజించి, ఇంటింటికి చేరవేస్తున్నట్లు పుకార్లు షికార్లు కొడుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు రూ.4.38 లక్షల నగదు, బంగారం రూ.3.14 కోట్లు, వెండి రూ.1.60 లక్షల విలువ గల వాటిని చెక్ పోస్టుల వద్ద సీజ్ చేశారు. రూ.12.69 కోట్ల విలువల లిక్కర్ స్వాధీనం చేసుకుని, పలువురిపై కేసు నమోదు చేశారు.

ఇళ్లలో మద్యం డంపింగ్

మంగళవారం సాయంత్రం నుంచి జిల్లాలో మద్యం దుకాణాలు మూసి వేయనుండడంతో, ఆయా రాజకీయ పార్టీల కేడర్ లక్షల విలువ చేసే లిక్కర్ రహస్య ప్రాంతాలకు తరలించారు. ఇదే అదనుగా భావిస్తున్న బెల్ట్ దుకాణాల యజమానులు క్వార్టర్, ఆఫ్ బాటిల్స్‌తో పాటు బీర్ల స్టాక్ ఉంచినట్లు సమాచారం. వైన్స్‌లు మూసివేయడంతో బెల్ట్ దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి ధరలు అమ్ముతున్నారు. ఎలక్షన్ కమిషన్ అధికారులు తనిఖీలు చేస్తూ, లిక్కర్ స్వాధీనం చేసుకుంటున్నా.. మరోవైపు ప్రైవేటు అమ్మకాలు ఆగడం లేదు. పనిలో పనిగా స్పిరిట్, కల్తీ మందు తయారీ చేసి, ఎన్నికల వేళ తోసేస్తున్నట్లు పలువురు మద్యం ప్రియులు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ ఉదయం వరకు మద్యం దుకాణాలను మూసి ఉంచనున్నారు.

పాలకుర్తిని వీడాలని ఝాన్సీరెడ్డికి నోటీసులు



తొర్రూరులో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి, పక్కన పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి

తొర్రూరు: ఎన్నికల ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో స్థానికేతరులు పాలకుర్తి నియోజకవర్గాన్ని వీడాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎన్ఆర్ఐ ఝాన్సీరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేయడం స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం రాత్రి డీఎస్పీ వెంకటేశ్వరబాబు తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి ఆమెకు నోటీసులు జారీ చేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. ఇదెక్కడి అన్యాయమంటూ ఝాన్సీరెడ్డి పోలీసులను ప్రశ్నించారు. తన కోడలు యశస్వినిరెడ్డిని బరిలో నిలిపానని, తాను నియోజకవర్గంలోని చెర్లపాలాన్ని దత్తత తీసుకున్నానని, ఇక్కడ పన్నులు కడుతున్నానని, తనను నియోజకవర్గం వీడాలనడం సరికాదన్నారు. కుట్రపూరితంగా తనకు నోటీసులు జారీ చేశారన్నారు. దీనికి మంత్రి దయాకర్‌రావు బాధ్యత వహించాలన్నారు. కనీసం ఆడవాళ్లు అని చూడకుండా ఇబ్బంది పెట్టడం ఏంటని ప్రశ్నించారు.

కొడుకును చూడడానికి వెళ్లి..

- అమెరికాలో వరంగల్ వాసి మృతి



గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: అమెరికాలో ఓరుగల్లు వాసి దుర్మరణం చెందాడు. అమెరికాలో ఉంటున్న కొడుకును చూడడానికి వెళ్లిన ఆయన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా.. ఉమ్మడి వరంగల్ (ఓరుగల్లు) పరిధిలోని హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని గంటూరుపల్లికి చెందిన రైతు పెద్ది గోవర్ధన్‌రెడ్డి కొడుకు వంశీకృష్ణారెడ్డి ఉన్నత విద్యాభ్యాసం కోసం రెండేళ్ల క్రితం అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లాడు. కాగా వంశీకృష్ణారెడ్డిని చూడడానికి ఈనెల 4న గోవర్ధన్ రెడ్డి న్యూయార్క్‌కు వెళ్లాడు. 15 రోజులు అక్కడే ఉన్న గోవర్ధన్‌రెడ్డి అనంతరం అట్లాంటాలో ఉంటున్న స్నేహితుడి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అట్లాంటాలో తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7.30 గంటలకు) వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. గోవర్ధన్‌రెడ్డి మృతితో గంటూరుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.